

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## పంచాయితీ నిధుల దుర్వినియోగం

**- 9 మంది అధికారులపై చర్యలు**

**నెల్లూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లాలోని మేజర్ పంచాయతీలలో ఒకటైన ఉదయగిరి పంచాయతీలో చోటుచేసుకున్న నిధుల దుర్వినియోగానికి సంబంధించి 9 మంది అధికారులపై చర్యలు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. 2014 నుండి 2020 కొరకు ఉదయగిరి గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి అప్పట్లో అక్కడ పని చేసిన ఎంపీడీవో ఆర్ఎస్ వీరాస్వామి, డిఎల్పిఓలు ఎన్ శ్రీనివాసరావు, ఏ. రమేష్, ఈఓపిఆర్డి ఎస్. ఆదినారాయణ, ఎస్కె జహీర్, స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహరించిన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లు వై.వాణి, వైవి. దయాల్, పంచాయితీ సెక్రటరీలు ఎల్. శ్రీనివాసరావు, ఎల్ చిన్నబాబులపై చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 25, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 198 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 19.782 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 0, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 88.230 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## వైసిపి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులు ఎటువంటి ప్రలోభాలకు లొంగరు

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో కావలి నియోజకవర్గంలో అన్ని స్థానాలను గెలుచుకుంటాం**

**- వైసిపి కావలి నియోజకవర్గం ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి**




**కావలి, అక్టోబర్25, ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలోని వైసిపి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులపై కొంతమంది నేతలు నామినేషన్లను ఉపసంహరించుకోవాలని డబ్బు,ఇతర ఆశలను చూపి ప్రలోభాలు పెడుతున్నారని అటువంటి ప్రలోభాలకు లొంగని వారే వైసీపీ ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులుగా నామినేషన్లు వేయడం జరిగిందని వైసిపి కావలి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసిపి నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడారు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయలసీమ, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో అభ్యర్థులను నామినేషన్లను వేనీయకుండా కూటమి పార్టీల నాయకులు ఏ విధంగా భయభ్రాంతులను చేసి అడ్డుకోవడం జరిగిందో చూస్తున్నామన్నారు. మనం ఉండేది ప్రజాస్వామ్యంలో కాబట్టి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నామన్నారు. ఎవరైనా ప్రజల మద్దతుతో గెలవాలి కానీ నామినేషన్లను వేయనీయకుండా భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెట్టి అడ్డుకోవడం మంచి సాంప్రదాయం కాదన్నారు. వైసిపి అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి నేతలపై జరిగిన దాడులకు సంబంధించిన ఆధారాలను కోర్టుకు సమర్పించడంతో కోర్టు ఏ విధంగా స్పందించిందో చూస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేసిన అక్రమాలు, వైసిపి నాయకులు, కార్యకర్తల పైనే కాకుండా నాపై కూడా అక్రమ కేసులను బనాయించడం జరిగిందన్నారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టిన భయభ్రాంతులకు గురిచేసిన ఎవరు కూడా భయపడే ప్రసక్తే లేదన్నారు. దగదర్తి మండలంలో కొన్ని ఆనివార్య కారణాల వలన 4ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేయలేకపోయామని రానున్న సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాలలో నామినేషన్లు వేసి తమ సత్తా చాటుతామని తెలియజేశారు. అధికారంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యేకి వైసిపి పార్టీ ఏంటో అర్థమైందని కానీ కొంతమంది ప్రలోభాలు పెడుతున్నారని ఎన్ని ప్రలోభాలు పెట్టిన మా అభ్యర్థులు భయపడదని వెనక్కి తగ్గరని తెలియజేశారు. కావలి నియోజకవర్గంలో వైసిపి పార్టీ బలంగా ఉందని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతుందని తెలియజేశారు. ప్రజలు త్వరలో జరిగే ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకుంటారని ఏ పార్టీ అభివృద్ధి చేసిందో ఏ పార్టీ అభివృద్ధి చేసిందని గొప్పలు చెప్పుకుంటుందో ఏ నాయకుడు సంక్షేమ పథకాలను అందించాడో ఏ నాయకుడు ప్రజలను మోసం చేశాడో ఇప్పటికే అర్థమైందని సరైన నిర్ణయం తీసుకుని కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలియజేశారు. ఇప్పటికైనా కూటమి పార్టీల నాయకులు, అధికారులు ఎన్నికల ను నిష్పక్షపాతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. మన జిల్లాలో నామినేషన్ల పర్వం సజావుగా జరిగినందుకు పోలీస్ శాఖకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చేజర్ల సుబ్బారెడ్డి, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, మాజీ బోగోలు మండలం అధ్యక్షులు వీరరఘు తదితరులు పాల్గొని కూటమి ప్రభుత్వ చేస్తున్న అరాచకాలను ఎంపిటిసి, జడ్పిటిసి అభ్యర్థులను ప్రలోభ పెడుతున్న నాయకులను ఎండగట్టారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

**: ప్రచార కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి**

**: రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు**



**నెల్లూరు కార్పోరేషన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేసేలా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని మేయర్ అభ్యర్థి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు సూచించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలనునిర్వహించేందుకు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ వై.నదన్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి సూచనలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామాగ్రిని ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లౌడ్‌స్పీకర్ల వినియోగం, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు, ఇంటింటి ప్రచారం, ర్యాలీల నిర్వహణ, కరపత్రాల పంపిణీ, జెండాలు, బ్యానర్ల ప్రదర్శన, ప్రచార వాహనాలకు అనుమతులు, ఎన్నికల వ్యయాల నమోదు తదితర అంశాలపై రాజకీయపార్టీల ప్రతినిధులకు ఎన్నికల సంఘం నిబంధనలను వివరించారు. ప్రతి నిధులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ అద్యంతం ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు ఓటర్లందరూ ఎలాంటి ఒత్తిళ్ళు, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

## పెళ్లకూరు కాలనీలో ఆపరేషన్ త్రిశూల్ - 30 బైక్‌లు సీజ్





**కోవూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** కోవూరులోని పెళ్లకూరు కాలనీ ప్రాంతంలో ఆదివారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు పీఆర్ కాలనీ ప్రాంతంలోని ప్రతి ఇంటిని నిశితంగా పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే దిశగా ఈ ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కేవలం ప్రజల భద్రత కోసమే ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలు అక్రమ ఆన్‌లైన్ కార్యక్రమాలకు దూరంగా ఉంటే మంచిదన్నారు. ముఖ్యంగా ఈ కాలనీ ప్రాంతంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మైనర్ అయిన తమ బిడ్డలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వలన అనేక ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 30 మోటార్ సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. వీటికి సరైనప పత్రాలు ఉంటేనే సంబంధిత యజమానులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ముత్యాలరావు, ఇందుకూరుపేట ఎస్సై నవీన్‌కుమార్, ఏఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు ఉన్నారు.

## చేజర్లలో ఆర్వో ఇష్టారాజ్యం..

**- స్క్రూట్నీలో నిబంధనలకు నీళ్లు..**

**- ఆర్డిఓకు అప్పీల్ చేసుకున్న బాధితులు**




**చేజర్ల, అక్టోబర్25, ప్రభాతవార్త** పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో చేజర్ల మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఇష్టా రాజ్యాంగ వ్యవహరించి ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కారని ఆరోపణలు రావడంతో పలువురు బాధితులు ఆత్మకూరు ఆర్డీవోకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. చేజర్ల మండలంలో 10ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 72నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. టిడిపి 30, వైకాపా 32, బిజెపి 6, జనసేన 1, స్వతంత్ర అభ్యర్థులు 3 నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. స్క్రూట్నీలో నాగులవెల్లటూరు, నెర్నూరు, పాడేరు, తూర్పుపల్లి, మాముడూరు గ్రామాల ఎంపీటీసీ ప్రత్యర్థుల నామినేషన్లు తొలగించడం జరిగిందన్నారు. మిగతా నాలుగు చోట్లలో మడపల్లి లో ఇండిపెండెంట్ అభ్యర్థిని చేజర్లలో బిజెపి అభ్యర్థిని టీకేపాడు, పుట్టుపల్లి గ్రామాలలో వైకాపా అభ్యర్థుల నామినేషన్ ఉంచడం జరిగిందన్నారు. ఎన్నికల స్క్రూట్నీ నియమావళి ప్రకారం ఉదయం 8గంటల నుంచి స్క్రూటీని ప్రారంభించాల్సి ఉండగా సాక్షాత్తు ఆర్వో ఈ నియమావళిని అమలు చేయకపోవడం పట్ల పలు ఆరోపణలు ఉన్నాయి. నామినేషన్ దాఖలు చేసిన ఎంపీటీసీ అభ్యర్థుల సమక్షంలో స్క్రూటీ నిర్వహించాల్సి ఉండగా.. వ్యక్తిగతంగా ఒక్కొక్కరిని ఆహ్వానించి స్క్రూటీని నిర్వహించడం మరో నిబంధన ఉల్లంఘించడమేనని బాధితులు ఫిర్యాదు చేయడం విశేషం. అర్ధరాత్రి 12గంటల పైన వరకు స్క్రూటీని నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కారని అధికార పక్షం నామినేషన్లను సక్రమంగా ఉన్నట్లు ప్రకటిస్తూ ప్రత్యర్థుల నామినేషన్‌లను స్వల్ప కారణాలు చూపుతూ వాటిని తొలగించడం పట్ల పలువురు అభ్యర్థులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. వీరిలో భారతీయ జనతా పార్టీ, స్వతంత్ర, అభ్యర్థి వైకాపా అభ్యర్థి, జనసేన అభ్యర్థులు ఉండటం గమనార్హం ఎన్నికల నియమావళిని తూ..చ తప్పకుండా పాటించాల్సిన రిటర్నింగ్ అధికారి వ్యవహార శైలి ఏకపక్షంగా మారడంపై పలువురు న్యాయపోరాటానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇలాంటి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ఈ విషయంపై మండల ప్రత్యేక అధికారి, ఆర్వో బొడ్డు ప్రసాద్ బాబును ఆదివారం 'ప్రభాతవార్త' వివరణ కోరగా.. నామినేషన్ స్క్రూట్నీలో ఉదయం 10గంటలకు రావడం మాత్రం వాస్తవమేనన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకే నామినేషన్లు ముగించాలని ఎక్కడ నిబంధన లేదన్నారు. నిబంధనల ప్రకారం చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క నామినేషన్ ను చేయడం వాస్తవమేనని ఆయన తెలిపారు.

## అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**- ఎస్పీ అజిత వెజెండ్ల**

**- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ క్యాండిల్ ర్యాలీ**



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. జాతీయ పోలీసు దినోత్సవం అక్టోబర్ 31న జాతీయ ఐక్యత దినోత్సవం (నేషనల్ యూనిటీ డే)లను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల స్మరణార్థం జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కెవిఆర్ పెట్రోల్ బంక్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం అమరవీరుల స్థూపం వద్ద క్యాండిల్స్ ఉంచి, వారి ఆత్మశాంతి కోసం ప్రార్థిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం కేవలం బాధ్యత మాత్రమే కాదని, ఎన్నో త్యాగాలతో కూడుకున్నదని కొనియాడారు. దీపం తాను కరిగిపోతూ ఇతరులకు వెలుగునిచ్చినట్లే, పోలీసు అమరవీరులు తమ ప్రాణాలను అర్పించి సమాజానికి భద్రత, రక్షణ కల్పించారని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా నిద్రించేందుకు, పండుగలను సంతోషంగా జరుపుకునేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత సమస్యలు, కుటుంబ బాధ్యతలను పక్కనపెట్టి ప్రజా సేవకే ప్రాధాన్యతనిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. సమాజ రక్షణ కోసం తమ ప్రియమైన వారిని కోల్పోయిన అమరవీరుల కుటుంబాల త్యాగం గొప్పదని, వారి సంక్షేమానికి పోలీసు శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. నేటి యువత అమరవీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరవీరుల సేవలు, త్యాగాలు భావితరాలకు నిరంతరం స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్యాండిల్ ర్యాలీలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) పి.వి. అప్పారావు, టౌన్ ఏఎస్పి దీక్ష, రూరల్ డిఎస్పి జి. శ్రీనివాసరావు, అలాగే స్పెషల్ బ్రాంచ్, టౌన్, రూరల్, ట్రాఫిక్, పిసిఆర్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కావలి ఆర్డిఓని కలిసిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి



**కావలి, అక్టోబర్25, ప్రభాతవార్త** వైసిపి కావలి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదివారం కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎలీషా బాబుని కలిసి ఎన్నికల గురించి పలు విషయాలను చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన వైఎస్ఆర్సిపి అభ్యర్థులను పలు రకాలుగా ప్రలోభాలు పెడుతూపలు పోటీలో నిలవకుండా చేయడానికి అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. కావలి రూరల్ మండలం రుద్రకోట వైసిపి ఎంపీటీసీ అభ్యర్థి జరుగుమల్లి భారతి నామినేషన్‌ను తిరస్కరించడం బాధాకరమన్నారు. దానికి ముందు పరిశీలనలో అన్ని సవ్యంగా ఉన్నాయి. అభ్యర్థికి సంబంధించి అధికారులు చెప్పిన విధంగా జతపరచడం జరిగిందన్నారు. పేరు కూడా ఓటర్ లిస్టులో ఉన్న విధంగా అప్లికేషన్ లో రాయడం కూడా జరిగిందన్నారు. అభ్యర్థిని పరిశీలనలో తొలగించినందున అప్పిలు చేసుకోవడానికి అవకాశం ఉన్నందున ఆర్డీవో కార్యాలయంలో అప్పిలు చేయడం జరిగిందన్నారు. ఈ అప్పీలు ద్వారా అభ్యర్థికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని తెలియజేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరపాలని కోరడం జరిగిందని తెలియజేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఈ విధంగా తొలగించడం బాధాకరమని తెలియజేశారు. దీనిని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. వైసిపి కావలి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



## ప్రారంభం అయిన ఉపసంహరణలు

**- మర్రిపాడు జెడ్పీటీసీ ఇండిపెండెంట్ అభ్యర్థి ఉపసంహరణ**

**- 26 మంది ఎంపీటీసీ అభ్యర్థుల ఉపసంహరణ**

**నెల్లూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త – కలెక్టరేట్** జడ్పిటిసి స్థానాలకు నవంబర్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉపసంహరణల పర్వం ఆదివారం మొదలైంది. జిల్లాలోని 35 జెడ్పిటిసి స్థానాలకు దాఖలైన నామినేషన్లలో 250 నామినేషన్లను అధికారులు ఆమోదించిన విషయం విదితమే. శనివారం నామినేషన్ల పరిశీలనా కార్యక్రమం జరగ్గా ఆదివారం నుండి ఉపసంహరణలకు పర్వం మొదలైంది. మొదటి రోజైన ఆదివారం మర్రిపాడు జెడ్పిటిసి స్థానానికి ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన జి.హిమబిందు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ స్థానానికి దాఖలైన నామినేషన్లలో ఆరింటిని అధికారులు ఆమోదించగా అందులో ఒకరు తమ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఇక అక్కడ ఐదు మంది పోటీలో ఉన్నట్టయింది. ఉపసంహరణల పర్వం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగనుంది.

**- 26 ఎంపీటీసీ అభ్యర్థుల ఉపసంహరణ** ఇక జిల్లాలోని 440 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఆదివారం 26 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బోగోలు, దగదర్తి, కలువాయి, ఉదయగిరి మండలాలలో ఒక్కొక్కరు, సంగం, తోటపల్లి గూడూరు మండలాలలో ఆరుగురు చొప్పున, వరికుంటపాడు మండలంలో నలుగురు, వింజమూరు, ముత్తుకూరు మండలాలలో ముగ్గురు చొప్పున తమ నామినేషన్లను ఉదాహరించుకున్నారు.

## ఫేక్ నామినేషన్లు, తిరస్కరణలపై న్యాయపోరాటం కొనసాగిస్తాం

**- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి**




**నెల్లూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త – వైద్యం** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక, వెల్లువలా వస్తున్న ప్రజావ్యతిరేకతకు భయపడి స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు వరుసగా దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని, తాజాగా ఫేక్ నామినేషన్లు, నామినేషన్ల తిరస్కరణలు, ఆమోదించి నామినేషన్ల విత్ డ్రాకు చేస్తున్న ప్రయత్నాలే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫైర్ అయ్యారు. చంద్రబాబు ఎన్ని అక్రమాలకు పాల్పడినా, జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన గుండె ధైర్యంతో వైఎస్సార్సీపీ అభ్యర్థులు వీరోచితంగా పోరాడుతున్నారని ఆయన కితాబిచ్చారు. చంద్రబాబు బ్లాక్ మెయిలింగ్ కూ, ఉడత ఊపులకూ బెదిరేది లేదని, ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని కాకాణి గోవర్ధన్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రెస్ మీట్లో కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హింసతో రాష్ట్రం పరువు తీస్తున్న చంద్రబాబురాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలపై వైఎస్సార్సీపీ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదులు చేయడం, పట్టించుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ తూతూమంత్రంగా నాలుగు చోట్ల మాత్రం నామినేషన్ల గడువు పొడిగించింది. ఆ తర్వాత రెండో ఘట్టంలో భాగంగా సుప్రీంకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇవ్వడం, చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పుబట్టడం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ దీని మీద సమీక్షించాలని ఇచ్చాక చంద్రబాబుకు ఏమాత్రమైనా నీతి నిజాయితీ ఉంటే రాజీనామా చేయాల్సిందింది. ఇంత అనుభవజ్ఞుడని చెప్పుకునే చంద్రబాబు.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అంటేనే ఏహ్యాభావం కలిగేలా, రాష్ట్రం పరువుకు తీవ్ర నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తీరు కొనసాగిస్తే మళ్లీ సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టేలా ఉందని తెలిసి మరో కుట్రకు తెరలేపారు. ఈ ఎన్నికల్లో అయినా చంద్రబాబు సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని వ్యవహరిస్తాడని అనుకుంటే అదీ జరగడం లేదు. దీనికి బదులుగా టీడీపీ అభ్యర్థులతో నామినేషన్లు వేయించడం, వైఎస్సార్సీపీ అభ్యర్థుల్ని అడ్డుకోవడం, టీడీపీకి సంబంధించిన వ్యక్తుల చేతే వైఎస్సార్సీపీ నామినేషన్లు కూడా వేయిస్తున్నారు. రేపు ఒకవేళ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించినా, లేదు అంతా న్యాయబద్ధంగా జరిగింది, నామినేషన్లు సక్రమంగానే దాఖలయ్యాయని చెప్పుకునేందుకు కుట్ర మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే ఫేక్ నామినేషన్లను ఆధారాలతో సహా మేం బయటపెడుతున్నాం. వైఎస్సార్సీపీ తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని చెప్పుకోకుండా ఉండేందుకు, నామినేషన్లు వేసిన వ్యక్తులు పోటీలో పాల్గొనకుండా చేసి, వారంతా ఓటు అడగకుండా చేసి, ఏకగ్రీవంగా గెలిచినట్లు చూపించుకునేందుకే ఇదంతా చేస్తున్నారు.

మిగతా 2 పేజీలో...

## కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

**- టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి**



**వింజమూరు, అక్టోబర్25, ప్రభాతవార్త** వింజమూరు మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడి పని చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మండలంలోని 12 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ స్థానాన్ని గెలిపించుకుని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు బహుమతిగా ఇవ్వాలని నాయకులను కోరారు. కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు. గెలుపు అనంతరం తాగునీటి, సాగునీటి సమస్యల పరిష్కారం, వింజమూరు పట్టణంలో సెంట్రల్ లైటింగ్, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులతో పాటు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహాయ సహకారాలతో మండలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు.

## వంగవీటి రాధాను కలిసిన కావలి రంగ విగ్రహ కమిటీ సభ్యులు



**కావలి, అక్టోబర్25, ప్రభాతవార్త** స్వర్గీయ వంగవీటి మోహన రంగ తనయుడు వంగవీటి రాధా బాబు విజయవాడ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న సందర్భంగా కావలి స్వర్గీయ వంగవీటి మోహన రంగ విగ్రహ కమిటీ సభ్యులు ఆయనను విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి మేయర్ అభ్యర్థిగా అఖండ విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా బాబు వీరిని సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించడం జరిగింది. నెల్లూరు జిల్లాలో తన తండ్రి రంగా



విగ్రహం ఎక్కడ లేకపోయినా కావలి పట్టణంలోని ప్రధాన కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని కనివిని ఎరుగని రీతిలో ఏర్పాటు చేసిన స్మృతులను పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి స్వర్గీయ వంగవీటి రంగ విగ్రహ కమిటీ సభ్యులు దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు, పసుపులేటి బాబురావు, దామ మల్లి, పెనుమల్లి అశోక్, సురేంద్ర, లింగిశెట్టి ప్రసాద్, కిరణ్ తదితర మిత్రులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ పోటీ నుండి తప్పుకున్న గంజం పెంచలప్రసాద్



**బుచ్చి అక్టోబర్ 25 ప్రభాతవార్త** ఉత్కంఠభరితంగా ఉన్న బుచ్చిరెడ్డిపాళెం నాలుగోవార్డు విషయంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా వేసి ఉన్న సీనియర్ బిజెపినాయకులు గంజం పెంచలప్రసాద్ పోటీ నుండి తప్పుకున్నారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సిఫా వంశీదర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి స్వయంగా పెంచలప్రసాద్ ఇంటికి వచ్చి ప్రసాద్‌తో మాట్లాడి ఆయనను పోటీ నుండి తప్పించారు. రామిశెట్టి కళ్యాణ్ బిజెపి అభ్యర్థికి చేసే విధంగా చేశారు. ఈ సందర్భంగా పెంచల ప్రసాద్ మాట్లాడుతు కొన్ని పరిస్థితుల వల్ల ఇండిపెండెంట్ అభ్యర్థిగా వేయాల్సి వచ్చిందని అన్నారు. బిజెపి అధిష్టానం, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు పోటీ నుండి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ప్రసాద్‌కి ఉన్నతమైన పదవిఇస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం నాలుగోవార్డు అభ్యర్థి రామిశెట్టి కేతన్‌ను తీసుకొనివచ్చి పెంచలప్రసాద్‌కి రాజీ చేశారు. ఈ సందర్భంగా పెంచల ప్రసాద్ మాట్లాడుతు తనకు పూర్తి స్థాయిలో సహకారం అందించిన భువనేశ్వరం మురళీకృష్ణాకు, ఎంవి శేషయ్య కిడాక్టర్ రాఘవరెడ్డికి, డాక్టర్ కృష్ణారెడ్డికి, నేలనూతల శ్రీదర్‌కి, గండి రఘురామయ్యకి, చోళం వెంకయ్య మరికొంతమందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎట్టికేలకు ఉత్కంఠభరితంగా ఉన్న 4 వవార్డులో బిజెపి నాయకుల సమస్య ఒక కొలికి వచ్చింది.

## స్థానిక సమరం.. మద్యం వ్యాపారుల సంబరం

**కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు మద్యం వ్యాపారులకు కాసుల వర్షం కురిస్తున్నాయి .కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని మద్యం వ్యాపారం అనూహ్యంగా పుంజుకుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల సైతం తమ ప్రచారాలకు ,కొంత మంది కార్యకర్తలకు మద్యం ఇవాల్సిందే. మద్యం నగదు ఇవ్వకపోతే మరో పార్టీ వైపు వెళ్లతారని. దీంతో కార్యకర్తల కొరకు మద్యం షాపుల నుంచి తెప్పిస్తు నట్లు సమాచారం. మళ్లీ నవంబరు 29 న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. మద్యం వ్యాపారం ఇదే విధంగా కొనసాగుతందని వ్యాపారులు ఆశాభావంతో ఉన్నారు.

## కూటమిలో చిచ్చు పెట్టే వైసీపీ కుట్రలు భగ్నం
## మంత్రి నారాయణపై దుష్ప్రచారాన్ని ఖండించిన జనసేన



**నెల్లూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త విద్య :** ఎన్నికల వేళ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని జనసేన మహిళా అభ్యర్థులు ఖండించారు. మంత్రి నారాయణపై ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తూ కూటమిలో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కూటమి అభ్యర్థుల విజయానికి మంత్రి నారాయణతో పాటు టీడీపీ శ్రేణులు పూర్తి సహకారం అందిస్తున్నాయని స్పష్టం చేశారు. జేమ్స్ గార్డెన్ లోని రూప్ కుమార్ కార్యాలయంలో ఆదివారం వీర మహిళలు మీడియా సమావేశం నిర్వహించారు. నెల్లూరు కార్పొరేషన్‌లోని 71వ డివిజన్ జనసేన అభ్యర్థి అలియా మాట్లాడుతూ, కూటమి పొత్తులో భాగంగా జనసేనకు చెందిన ముగ్గురు మహిళలకు కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. మంత్రి నారాయణ ఆదేశాలతో టీడీపీ క్యాడర్ తమ గెలుపు కోసం కష్టపడుతోందని తెలిపారు. జనసేన పోటీ చేస్తున్న డివిజన్లలోనూ మంత్రి అన్ని విధాలా సహకరిస్తున్నారని చెప్పారు. నారాయణ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అడుగుతున్నామని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ నాయకత్వంలో, మంత్రి నారాయణ సహకారంతో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నామన్నారు. 21వ డివిజన్ జనసేన అభ్యర్థి గునుకుల విజయలక్ష్మి మాట్లాడుతూ, జనసేనకు ఓటు వేయొద్దని మంత్రి నారాయణ ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. మంత్రి చేసిన అభివృద్ధి తమ ప్రచారానికి బలంగా మారిందని తెలిపారు. మంత్రి సతీమణి రమాదేవి, కుమార్తెలు సింధూర, షరణి సైతం కూటమి అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు .15వ డివిజన్ జనసేన అభ్యర్థి కెజియా కుమారి మాట్లాడుతూ, మంత్రి నారాయణకు ప్రజల్లో ఉన్న మంచి పేరు తమకు ప్రచారంలో ఆదరణ తెచ్చిపెడుతోందన్నారు. మంత్రి తమకు గుర్తింపు, గౌరవం ఇస్తూ సహకరిస్తున్నారని చెప్పారు. దుష్ప్రచారాలను నమ్మకుండా కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు .

## 40 ఏళ్లుగా జెండా మోశా.. నాకెందుకు మొండిచేయి?

: ఎంపీటీసీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వలేదని ఊకోటి సుధాకర్ ఆవేదన

: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పందించాలి.. అధిష్ఠానం న్యాయం చేయాలి



**విడవలూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** నాలుగు దశాబ్దాలుగా పార్టీ జెండా మోస్తూ, కష్టకాలంలోనూ వెన్నంటి నిలిచినా తనకు తగిన గుర్తింపు లభించలేదని వావిళ్ల గ్రామానికి చెందిన ఉప్పూరు సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరినా తనకు టికెట్ ఇవ్వకుండా మరొకరికి కేటాయించారని వాపోయారు. గతంలో పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు ఎన్నికల బరిలోకి దిగేందుకు ముందుకొచ్చానని, ప్రస్తుతం అనుకూల పరిస్థితులు నెలకొన్న వేళ తనను పక్కన పెట్టారని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ఏ పదవీ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'నేనెందులో తక్కువ.. సమాధానం చెప్పాలి'తనకు అవకాశం కల్పించాలని కోరినప్పుడు మండల అధ్యక్షుడు ఏటూరు శ్రీహరిరెడ్డి 'నువ్వు చాలవురా' అని అన్నారని సుధాకర్ ఆరోపించారు. తాను ఎందులో సరిపోనో స్పష్టంగా చెప్పాలని ప్రశ్నించారు. రాత్రి 9.30 గంటల వరకు ఎదురుచూసినా సరైన సమాధానం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఇన్నేళ్లుగా పనిచేసిన తన అర్హతను గుర్తించకుండా పక్కన పెట్టడం బాధ కలిగించిందన్నారు. కష్టకాలంలో ముందుకొచ్చా.. ఇప్పుడు పక్కన పెట్టారుగతంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని సమయంలో తాను ధైర్యంగా బరిలోకి దిగానని సుధాకర్ తెలిపారు. అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా తన భార్యతో నామినేషన్ వేయించానని గుర్తుచేశారు. పార్టీకి అవసరమైన సమయంలో అండగా నిలిచిన తనకు, ఇప్పుడు అవకాశం వచ్చినప్పుడు అన్యాయం చేశారని వాపోయారు. ఎంపీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీఎంపీటీసీ టికెట్ కేటాయింపుతో మనస్తాపానికి గురైన తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సుధాకర్ వెల్లడించారు. పార్టీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి ఉందని, తమ ఆవేదనను బహిరంగంగా వ్యక్తం చేయలేక లోలోపల మదనపడుతున్నారని అన్నారు. తనకు జరిగిన అన్యాయం పార్టీ పెద్దలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అధిష్ఠానం జోక్యం చేసుకోవాలికోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పందించి తనకు న్యాయం చేయాలని సుధాకర్ కోరారు. అవసరమైతే నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌ల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తానని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ఎంపీటీసీ అభ్యర్థిగా ఎందుకు అవకాశం ఇవ్వలేదో నాయకత్వం సమాధానం చెప్పాలని కోరారు. శ్రీధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీ త్యాగాలను మరువబోము;మీదారిని విడవబోము



**కలిగిరి, అక్టోబర్25, ప్రభాతవార్త :** మీత్యాగాలను మరవబోము, మీదారిని విడవ బోము అంటూ ప్రతిజ్ఞచేశారు కలిగిరి పోలీసులు. పోలీసుల అమర వీరుల దినోత్సవం సందర్భంగా కలిగిరి పురవీదుల్లో పోలీసులు కొవొత్తుల ర్యాలీ తో అమరవీరులకు జోహార్... అమర వీరుల్లారా జోహార్..! అంటూ నినాదాలు చేశారు. ముందుకు కలిగిరి బస్టాండు సెంటరువద్ద కొవొతుల్లతో మానవ హారం ఏర్పాటు చేసిన పోలీసులు అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ ప్రజలకోసం ప్రజల అబ్యున్నతికోసం అహర్నిశలు కష్టపడే వ్యక్తులు పోలీసులు. అలాంటి పోలీసులకు సమాజంలో ఒకగౌరవ ప్రధమైనస్తానం ఉంది. అదే పోలీస్ భలం ఆనాడు ప్రజలకోసం తమ కర్తవ్యంలో బాగంగా పనిచేస్తూ ఎంతోమంది పోలీసుల అమర వీరులైనారు. అలాంటి అమర వీరులను స్తుతించుకుంటూ వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఈనాడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని వారిబాటలోనే పయనిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. జిల్లా యస్పీ ఆదేశాలమేరకు డియస్పీ సూచనలతో సిఐ సుబ్బారావు ఆద్వర్యంలో ఈకార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కలిగిరి యస్‌ఐ ఉస్నీసా, వింజమూరు యస్, కలిగిరి ఏయస్ఐ రామచంద్రన్, పోలీసు శిబ్బంది, పుర ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ.. పోలీసుల కవాతు!

**: సీఐ.దుర్గా ప్రసాద్ రావు**




**కొడవలూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతా భావం కల్పించడమే లక్ష్యంగా మండలంలోని నార్త్ రాజుపాలెంలో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ ఓ. దుర్గా ప్రసాద్ రావు ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లో పోలీసు సిబ్బంది పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం రాజుపాలెం కూడలి వద్ద పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విడవలూరు, కొడవలూరు ఎస్సైలు సాయి కళ్యాణ్, కోటిరెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తింపు పొందిన పార్టీలు' ఎ'పారమ్' బి'పారమ్‌లను ఎన్నికల అధికారికి అందజేయాలి.

**కలిగిరి, అక్టోబర్25, ప్రభాతవార్త;** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల పోటీచేయు అబ్యర్డులు 'ఎ'పారమ్ 'బి'పారమ్ ఎన్నికల అధికారులకు అందజేయవలసి ఉంటుందని కలిగిరి మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. శివప్రసాద్ ఆదివారం తెలిపారు. యస్ఇసి మార్గదర్శకాలప్రకారం ఆంధ్రప్రదేశ్ యంపిటిసి ,జడ్పీటీసి ఎన్నికలకు పోటీ చేయు అబ్యర్డులు ,సంభందిత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ అబ్యర్డులుపామ్'ఎ'పామ్ 'బి'అందజేయవలసి ఉంటుందన్నారు. కలిగిరి మండలంలో పోటీచేయుచున్నయంపిటిసి, జడ్పీటీసి అబ్యర్డులు ఈనెల 27 మద్యాహ్నం3 గంటల లోపు పామ్ బి ఆర్ఓకి అందజేయాలన్నారు. అదేవిదంగా పామ్ ఎ పామ్ బిలపై పార్టీ అద్యక్షులు, లేదా ప్రదాన కార్యదర్శిలసంతకం ఉంటే చెల్లుబాటు అవుతుం దన్నారు. రబ్బర్ స్టాంపులు, పాక్స్ మైల్ సంతకాలు, పాక్స్‌ద్వారా పంపిపపారమ్‌లు చెల్లవన్నారు. నామినేషన్ ఉపసంహరణకు నామినేషన్ వేసిన అబ్యర్ది తప్పక రావాలన్నారు.

## ఫేక్ నామినేషన్లు, తిరస్కరణలపై న్యాయపోరాటం కొనసాగిస్తాం

మొదటి పేజీ తరువాయి ...

**- ఫేక్ నామినేషన్లతో మరో కుట్రకు తెరలేపిన చంద్రబాబు** ఎన్ని విధాలుగా కుట్రలు, దొంగతనాలకు పాల్పడాలో అన్నీ తెలిసిన వ్యక్తి చంద్రబాబు. ఆయన జీవితంలో ఎక్కడా నీతి, నిజాయితీ కనిపించవు. అందుకే ఫేక్ నామినేషన్లు వేయించి, దొంగ లెక్కలు, కాకి లెక్కలతో ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రహసనంగా మార్చేస్తున్నారు. మొదటిది దాడులు చేసి నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, రెండవది సుప్రీంకోర్టు తీర్పు తర్వాత నామినేషన్లు వేయలేదనే అంశాన్ని అధిగమించడానికి తన మనుషులతో దొంగనామినేషన్లు వేయించడం, మూడవది కొంత మంది ఎదురుతిరిగి నామినేషన్లు వేసిన వాళ్ల నామినేషన్లను తిరస్కరించడం. నెల్లూరు జిల్లాల్లోనూ ఇలాగే రిటర్నింగ్ అధికారులు ఏమాత్రం నీతీ నిజాయితీలు లేకుండా, అన్నీ విడిచిపెట్టి, అక్కడున్న టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రుల మాటల్ని వేదంలా భావించి, వారి స్వామి భక్తిని చాటుకున్నారు. ప్రజాస్వామ్య విలువలకూ, రాజ్యాంగ నిబంధనలకు పాతరేస్తూ ఆర్వోలు వ్యవహరిస్తున్నారు. ఏదో విధంగా బలమైన అభ్యర్థుల్ని, వైఎస్సార్సీపీ తరఫున గెలుస్తారని అనుకున్న వారి నామినేషన్లను తిరస్కరిస్తున్నారు. వెంటనే అప్పీలుకు వెళ్తారు కాబట్టి తిరస్కరణకు గురైన నామినేషన్లు ఆమోదించకుండా ఆర్డీవోలపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే కొన్ని చోట్ల ఆర్వోలు ఆమోదించిన నామినేషన్లను సైతం తిరస్కరించాలంటూ ఆర్డీవోలకు అప్పీల్లు పెడుతున్నారు. వృత్తి పేరు రాయలేదని ఒకరి నామినేషన్, పెళ్లి కాకపోయినా భార్య ఆస్తులు డిక్లేర్ చేయలేదంటూ మరో నామినేషన్ తిరస్కరించారు. పెళ్లే కాని వ్యక్తికి భార్య ఎక్కడి నుంచి వస్తుంది చంద్రబాబూ. మా లీగల్ టీమ్ వెళ్లి అభ్యంతరాలు చెప్పినా, మీరు చెప్పాల్సిన అవసరం లేదు, రాతపూర్వకంగా ఇచ్చి వెళ్లాలని ఆర్వోలు చెప్పేస్తున్నారు. నామినేషన్ తిరస్కరించినట్లు కొన్ని చోట్ల లేఖలు ఇచ్చారు, మరికొన్ని చోట్ల అది కూడా ఇవ్వడం లేదు. ఏ కారణంతో తిరస్కరించారో చెప్పాలని మా అభ్యర్థులు ఆర్వోల దగ్గర అప్పీలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా చంద్రబాబు ఈ ఎన్నికలు నా వల్ల కావని కాడి కింద పడేసి వెళ్లిపోయారు. కానీ ఇవాళ విపక్షంలో ఉండి జగన్మోహన్ రెడ్డి పిలుపుకు స్పందించి నామినేషన్లు వేసేందుకు ముందుకొచ్చి పోరాటం చేస్తుంటే, దాన్ని తట్టుకోలేకపోతున్నారు. అందువల్ల ప్రతీ ఒక్కరికీ పోటీ చేసే, ఓటు వేసే హక్కు కల్పించాలని న్యాయపోరాటం చేస్తామన్నారు. మీ బ్లాక్ మెయిలింగ్‌కు, ఉడత బెదిరింపులకు భయపడేది లేదు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన గుండె ధైర్యంతో వైఎస్సార్సీపీ శ్రేణులు పోరాడతాయి. వైఎస్సార్సీపీ క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉంది, వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించే అవకాశం ఉందన్న నిఘా నివేదికలతోనే ఎలాగైనా పరువు ప్రతిష్టలు కాపాడుకునేందుకు చంద్రబాబు చేస్తున్న కుట్రల్ని ఖండిస్తున్నాం. వైఎస్సార్సీపీ తమ అభ్యర్థులతో పాటు ప్రజలకూ అండగా నిలుస్తుంది. అక్రమాలకు అండగా నిలిచిన పోలీసులపై ప్రైవేటు కేసులు వేయబోతున్నామన్నారు. వాటి ఆధారంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాగానే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

## కావలిలో పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీ




**కావలి, అక్టోబర్25, ప్రభాతవార్త** పోలీసుల అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక డిఎస్పి కార్యాలయం వద్ద నుండి ట్రంకు రోడ్డు మీదుగా ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించి మానవహారం చేపట్టి నినాదాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కావలి ఒకటో, రెండో గ్రామీణ స్టేషన్ల సీఐలు వై.రంగనాథ్‌గౌడ్, ఎస్.శ్రీనివాసులు, గుడి రాజేశ్వరరావులు పాల్గొని పోలీసు అమరవీరుల సేవలు ఎనలేనివని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎస్.సుమన్, గోపీనాథ్, బాజీబాబు, తిరుమలరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన జాబితా ప్రచురణ

**కావలి, అక్టోబర్25, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి నోటిఫికేషన్ ప్రకారం కావలి పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 44 వార్డులకు సంబంధించిన వార్డుల వారి ఫోటో ఓటర్ జాబితాను ఈనెల 24వ తేదీన ప్రచురించడం జరిగిందని కావలి మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రచురించిన ఓటరు జాబితాను పట్టణ ప్రజల పరిశీలన నిమిత్తం పురపాలక సంఘ ప్రత్యేక ఎన్నికల సెల్ నందు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని ఓటరు జాబితాలో ఉన్న వివరాలను పరిశీలించుకోవలసినదిగా తెలియజేశారు.

## సంగంలో పోలీసులు క్యాండిల్ ర్యాలీ



**సంగం అక్టోబర్ 25 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులు త్యాగాలను స్మరించుకుంటు నెల్లూరు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు సంగం పోలీస్ శాఖ ఆద్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సంగం గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో ఎస్ఐ బోజ్యానాయక్ నాయకత్వంలో పోలీస్ సిబ్బంది కొవ్వుత్తులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కొల్పోయిన పోలీస్ అధికారులు సిబ్బందికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బోజ్యానాయక్ మాట్లాడుతు గత ఏడాది కాలంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరులైన పోలీస్ అధికారులు సిబ్బందిని స్మరించుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ క్యాండిల్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కున్నారు. ఈకార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గోన్నారు.

## సీతారామపురం మండలంలో 24 నామినేషన్లు తిరస్కరణ

**సీతారామపురం అక్టోబర్ 25 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సీతారామపురం మండలంలోని 7 ఎంపిటిసి స్థానాలకు దాఖలు అయిన 78 నామినేషన్లలలో 24 నామినేషన్లను తిరస్కరణకు గురికాగా 54 నామినేషన్లు ఆమోదం పొందాయి. ఈనెల 21 నుండి 23 వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించగా 24 వ తేది న జరిగిన పరిశీలన అనంతరం ఆర్ఓ చెన్నారెడ్డి ఆమోదించిన నామినేషన్ల వివరాలను నోటీస్ బోర్డులో ప్రకటించారు. ఆమోదం పొందిన నామినేషన్లలలో సీతారామపురం బిట్ 1 నుండి 11 ,బిట్ 2 నుండి 6 ,సింగారెడ్డిపల్లి నుండి 9, బాలయపల్లి నుండి 6, బసినేనిపల్లి నుండి 5 పబ్బులేటి పల్లి నుండి 6 నెమళ్ల దిన్నె నుండి 7 నామినేషన్లు ఉన్నాయి. ఇది ఇలా ఉండగా వైసిపి ఎంపిపి అభ్యర్ది చింతంరెడ్డి లోకేష్‌రెడ్డి సింగారెడ్డిపల్లి ఎంపిటిసి స్థానం నుండి టిడిపి ఎంపిపి అభ్యర్ది చింతల కళావతి ఎంపిటిసి స్థానంలో పోటీలు ఉన్నారు. వీరిద్దరి నామినేషన్లు ఆమోదం పొందడంతో ఎన్నికల బరిలో నిలిచేందుకు మార్గం సుగమం అయింది.

# ఫల సరుకులు పంపిణీ



**గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని నిరుపేదలకు సాయం చేయడమే పరమావధిగా పనిచేస్తున్న ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గూడూరు బాలాజీ నగర్‌లోని ప్రగతి కార్యాలయంలో నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దివంగత పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం, వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సంపూర్ణ సహకారంతో ప్రతి నెలా నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా 15 నిరుపేద కుటుంబాలకు 18 రకాల సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడవేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్న వారిని అందుకోవడమే సేవ అని తెలిపారు. తండ్రి జ్ఞాపకార్థం నిరుపేదల ఆకలి తీర్చేందుకు ముందుకు వచ్చిన పొణకా మల్లికార్జున రెడ్డి సేవా గుణం ఎందరికో ఆదర్శనీయమని ప్రశంసించారు. ప్రతి నెలా నిరుపేదలను గుర్తించి వారికి అండగా నిలవడం తమ సంస్థకు ఎంతో సంతృప్తిని ఇస్తోందని, దాతల సహకారంతో భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు, వాకాటి రామ్మోహన్ రావు కుమార్ నాయుడు, వాచ్ షాప్ రాము, రాజశేఖర్ రెడ్డి సురేష్ రాజు, కోట వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి పెంచలయ్య, సంచి ముని ప్రసాద్, కృష్ణారెడ్డి, విజయ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూత



**గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో వివిఎస్‌ఆర్ స్కూల్ కరస్పాండెంట్ నంది మండలం బాలకృష్ణ రాజు దాతృత్వంలో చేతుల మీదుగా దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణంరాజు మాట్లాడుతూ జేవివి ద్వారా అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్నానని నాకు అవకాశం ఉన్నప్పుడల్లా ఇంకా మంచి కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. జెవివికి ఎల్లపుడు సహకారం అందిస్తామన్నారు. గత నాలుగు రోజుల నుండి దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రామమోహన్, పురుషోత్తమరావు చెంచు నారాయణ, సుబ్బారావు, ఆనంద్, సుబ్రహ్మణ్యం, అక్కం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి



**గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఆదివారం గూడూరు డీఎస్పీ నరసింహమూర్తి ఆద్వర్యంలో గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ కూడలి నుండి టవర్ క్లాక్ వరకు పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన ఎందరో పోలీస్ సిబ్బంది త్యాగాలు మరువలేనివి అన్నారు. వారికి ఘన నివాళులు అర్పిస్తున్నామన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాస్, మాలకొండయ్య, ఎస్.ఐ శిరీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**కోట,అక్టోబర్ 25 ప్రభాతవార్త :** కోట మండలం కొక్కుపాడు గ్రామ పంచాయతీలో గత 25 ఏళ్లుగా స్దానిక ఎన్నికల్లో పోటీ లేకుండా అభ్యర్దులను ఏక గ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఎవరికి పదవి ఇవ్వాలనేది

# కొక్కుపాడు పంచాయతీ 25 ఏళ్లగా ఏక గ్రీవమే !
## రెండు పార్టీల పరస్పర అంగీకారం

గ్రామస్దులే గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయిస్తారు.అ గ్రామంలో గత 25 ఏళ్ల కిందట సర్పంచ్‌గా యరటపల్లి మధుసూదున్‌రెడ్డి, శారదమ్మ, లక్ష్మీయ్య, ఉలస బక్కయ్య, యురటపపల్లి ఇందిరమ్మలు ఏక గ్రీవంగా సర్పంచులగా పని చేశారు.దీంతో ప్రభుత్వం అందించే ప్రోత్సహంతో పంచాయతీని అభివృద్ధి చేసుకొంటారు. ఆగ్రామంలో రాజకీయ నాయకులు అందరు కలిసిమెలసి ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. తర్వలో జరగబోవు పంచాయతీ ఎన్నికను కూడా పోటీ లేకుండా ఏక గ్రీవంగా ఎన్నుకోనున్నారు.ఒక వర్గం సర్పంచ్ మరో వర్గం ఉప సర్పంచ్ పదవులు ఇచ్చేలా పెద్దలందూరు కలిసి నిర్ణయించుకొనున్నారు. ఎన్నికలు జరిగితే ఘర్షణలు, డబ్బు ఖర్చు వృద్దా ఎందుకని కొక్కుపాడు పంచాయతీ ప్రజలు మంచి నిర్ణయం తీసుకోంటారని అందరు ఆపంచాయతీని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏక గ్రీవం అయితే ప్రభుత్వం ద్వారా నిధులు వస్తాయి, ఆనిధులు ద్వార పంచాయతీని అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవచ్చును. ఇప్పటికే ఈ పంచాయతీలో అన్నీ వీధులు సీమెంటు రోడ్లు,తో కళాకళాలాడుతోంది.ఎక్కడ మట్టి రోడ్డు కనబడవు, తాగునీరు, వీధిలైటింగ్ సిస్టిమ్, వంటి మౌలిక వసతులతో ఆ గ్రామం ఏంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చును. చిన్న సమస్యను కూడా రెండు పార్టీలు కలసి పరిష్కరించుకొంటారు.

# ఆత్మకూరులో ముమ్మరంగా వాహన తనిఖీలు



**ఆత్మకూరు,అక్టోబరు25,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు ఎస్ఐ జంపా నికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆది వారం వాహన తనిఖీలు ముమ్మ రంగా చేశారు. నెల్లూరుపాళెం, చేజర్ల వైపు వెళ్ళే రోడ్డులో ఎస్ఎస్‌టి, ఫ్లయి ంగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహి స్తున్నారు. నగదు, మద్యం ఇతర ప్రలోభ వస్తువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. 50వేలకు పైగా నగదు తీసుకెళ్ళేవారు ఆధారాలు చూపించాలని అధికారులు సూచించారు. ప్రశాంతమైన ఎన్నికలకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ జంపాని కుమార్ కోరారు.

# అభ్యర్థుల గుండెల్లో ఐవిఆర్ఎస్ గుబులు

**కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** గూడూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల్లో ఐవిఆర్ఎస్ సర్వే గుబులు పుట్టిస్తోంది. సాధారణంగా కూటమి అభ్యర్థులు ప్రతిపక్ష వైసీపీతో పోటీపడాలి. కానీ, అధికార కూటమిలో పదవులకు విపరీతమైన పోటీ ఉంది. దీంతో కూటమిలోని టీడీపీతో పాటు బీజేపీ అభ్యర్థులు సైతం కీలక స్థానాలను తమకే కేటాయించాలని పట్టుపడుతున్నారు. ఈ పరిస్థితి నియోజకవర్గంలో ఉన్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల టీడీపీలోనే రెండు వర్గం నాయకులు సైతం సీట్లు ఆశించి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నామినేషన్లు వేశారు. అయితే కూటమి వర్గాల్లో సీట్లు సర్దుబాటు ఓ కొలిక్కి రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉపసంహరణల నాటికి వీటిపై నిర్ణయం తీసుకునేలా అధిష్టానం సమాలోచనలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే ఎంపిటిసి, జెడ్పిటిసి అభ్యర్థులు ఖరారుకు పార్టీ కార్యాలయం నేరుగా ఆయా ప్రాదేశిక ఓటర్లు, కార్యకర్తల అభిప్రాయాన్ని ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా తెలుసుకుంటుంది. ఈ విషయం అభ్యర్థులను ముచ్చెమటలు పట్టిస్తోంది. ఈ సర్వేలో తమకు అనుకూలంగా మెజార్టీ మద్దతు రాకపోతే ఎక్కడ బి-ఫాం ఇవ్వరోనన్న సందేహం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ఈ నెల 27న అభ్యర్థులకు బి-ఫాం అందిస్తామని కోట మండల టీడీపీ అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి 'ప్రభాతవార్త'కు తెలిపారు.

# బ్యాలెట్ బాక్స్‌లను తనిఖీ చేసిన ఆర్ఓ



**ఉదయగిరి, అక్టోబర్25, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయం నందు ఎన్నికల బ్యాలెట్ బాక్సులను ఆర్ఓ వెంకటరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని బాక్సులు వచ్చాయి, వాటి పనితీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుకుమార్, డిప్యూటీ ఎంపీడీవో అలాగే ఏవో తదితరులు పాల్గొన్నారు

# ఎంపీటీసీ స్థానం ఉపసంహరణ



**ఉదయగిరి, అక్టోబర్25, ప్రభాతవార్త :** కొనసాగుతున్న స్థానిక ఎంపీటీసీ స్థానాల ఉప సంహరణలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెంకటరెడ్డి సమక్షంలో ఆదివారం స్థానిక బొజ్జ రాజ్ కుమార్ తండ్రి బొజ్జ శ్రీనివాసులు ఉదయగిరి-3 ఎంపీటీసీ స్థానం నుండి నామినేషన్ ను ఉప సంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణములోని స్ట్రాంగ్ రూమ్ ను ఎంపీడీవో టి సుకుమార్, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా కలిసి స్ట్రాంగ్ రూమ్ లోని బ్యాలెట్ బాక్సు లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నామినేషన్ లు అభ్యర్థుల అంగీకారంతో అవసరాన్ని బట్టి నామినేషన్ ను ఉపసంహరించుకోవచ్చన్నారు.స్థానిక ఎన్నికలకు ఉన్నతఅధికారుల ఆదేశా మేరకు స్ట్రాంగ్ రూమ్ లోని బాలెట్ బాక్సులను పరిశీలన చేసి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# తొలి రోజు మూడు నామినేషన్ల ఉపసంహరణ

**వింజమూరు, అక్టోబర్25, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని 12 ఎంపీటీసీ సెగ్మెంట్లకు మొదట 106 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం 72 నామినేషన్లు సక్రమమైనవిగా గుర్తించినట్లు ఆర్వో ఎం.శేషగిరిరావు తెలిపారు. ఆదివారం నుండి మంగళవారం వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించిన నేపధ్యంలో తొలి రోజు ఆదివారం 3 నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు ఆయన వెల్లడించారు. వింజమూరు 6వ సెగ్మెంట్ నుండి తాళ్లూరి శిరీష(టీడీపీ), బుక్కాపురం సెగ్మెంట్ నుండి చాట్ల రమేష్‌రెడ్డి, తమ్మిదల విజయభాస్కర్‌రెడ్డి(టీడీపీ అభ్యర్థులు) తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఉపసంహరణకు మరో రెండు రోజులు గడువు ఉందని, ఉపసంహరించుకోవాలనుకునే వారు 27వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు తమ ఉపసంహరణ పత్రాలను నేరుగా ఆర్వోకు అందజేయాలని సూచించారు.

# కొండ బిట్రగుంటలో శ్రీ ప్రసన్నుడి వెంకటేశ్వర స్వామి గరుడ సేవ

**బిట్రగుంట అక్టోబర్ 25 ప్రభాతవార్త:** బోగోలు మండలం మండలం కొండ బిట్రగుంట గ్రామంలోని కొండపై వెలసివున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు అశ్వియుజ పౌర్ణమి సందర్భంగా సందర్భంగా సోమవారం గరుడసేవ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఈ ఓ ఆరవ రాధా కృష్ణలు పేర్కొన్నారు.

# కలిసి రాని పొత్తు.. కలపాలని కసరత్తు

**కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానాలకు పోటాపోటీగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కూటమి నేతలు పొత్తు ధర్మాన్ని సైతం పాటించకుండా విడివిడిగా నామినేషన్ల పత్రాలు సమర్పించారు. వర్గ విభేదాల కారణంగా గూడూరు నియోజకవర్గంలో ఎవరికి వారు బరిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. మాట వినకుంటే మూడు పార్టీలకు నష్టం తప్పదని, నామినేషన్లను ఉపసంహరించుకోవాలని పార్టీ పెద్దల నుంచి ఆయా అభ్యర్థులకు నచ్చచెప్తున్నా చాలాచోట్ల వినిపించుకోని పరిస్థితి నెలకొంది. గూడూరు నియోజకవర్గంలో బిజెపి కడివేడు, నెలబల్లిరెట్టపల్లి స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. ఖచ్చితంగా ఆ రెండు ఎంపిటిసి స్థానాలను తమకే కేటాయించాలని జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు బైరప్ప జిల్లా పార్టీ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డిని కోరినట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది తక్కువ ఓట్లు కావడంతో ఇరువర్గాలు నష్టపోయే పరిస్థితి కనిపిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థాన నిర్మాణకర్త అకాల మృతి



**కోవూరు,అక్టోబర్ 25 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రమీల నగర్ పీవీ ఆర్ అవెన్యూలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థాన నిర్మాణ కర్త పచ్చిపాల వెంకురెడ్డి శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ దేవాలయాన్ని సిద్ధం చేసి దానిని ప్రజల కోసం అంకితం చేసిన వెంకురెడ్డి మరణం తమకెంతో బాధగా ఉందని, ఆ ప్రాంత ప్రజీనీకం తెలిపారు. పార్టీలకతీతంగా అనేక మంది వెంకురెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళుల ర్పించారు.

# పోలీసు అమరవీరులకు ఘన నివాళి



**ఉదయగిరి, అక్టోబర్25, ప్రభాతవార్త :** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు ఆది వారం రాత్రి ఉదయగిరి పోలీసు అధికారులు సిబ్బంది ఘన నివాళులర్పిం చారు. పోలీసు అమరవీరుల సంస్కరణ వారోత్స వాలు2026లో భాగంగా ఉదయగిరి పంచా యతీ బస్టాండ్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు.పోలీసు అమరవీరులకు నినాదాలు చేసి వారు చేసిన త్యాగాలను కొనియాడారు.ర్యాలీలో పోలీసు అధికారులతో పాటు స్థానికులు నాయకులు పాల్గొని అమరవీరులకు నివాళు లు అర్పించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిని, కొండాయపాలెం మాజీ సర్పంచ్ గానుగ పంట ఓబుల్ రెడ్డి, స్థానిక నాయకులు ఎస్దాని, తదితరులు పాల్గొన్నారు.

# చాముండేశ్వరి దేవస్థానంలో నెలతలియ



**కోవూరు,అక్టోబర్25 ప్రభాతవార్త :** కోవూరులోని బుద్ధివారి వీధిలో వెలసి ఉన్న శ్రీ రామలింగ చాముండేశ్వరి మహాదేవి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం దేవస్థానంలో నెలతలియ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచ్చుక మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, సంఘ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో ఉన్నారు.

# శాంతిక్యాండిల్ ర్యాలీ



**కోవూరు,అక్టోబర్25 ప్రభాతవార్త :** పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల సందర్భంగా స్థానిక బజారు సెంటర్‌లో కోవూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా క్యాండిల్ ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. శాంతి భద్రతల విషయంలో ప్రాణాలు పోగొట్టుకుని అమరులైన పోలీసుల జ్ఞాపకార్థంగా కాసేపు మౌనవ్రతం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై ముత్యాలరావు, ఇందుకూరుపేట ఎస్సై నవీన్‌కుమార్, ఏఎస్సైలు సత్యనారాయణ, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు ఉన్నారు.

# శ్మశాన భూములను వదులుకొనే ప్రసక్తే లేదు



**కావలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** ఎంతమందిని కాల్చిన కూడా శ్మశాన భూములను వదులుకొనే ప్రసక్తే లేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట శ్మశాన స్థలంలో వందలాది మంది ప్రజలు మా శ్మశాన స్థలాన్ని ఎన్ని కోర్టు ఆర్డర్లు ఇచ్చినా, ఎంత మంది పోలీసులు వచ్చినా శ్మశాన భూమిని వదులుకొనే ప్రసక్తే లేదని ఆదివారం నిరసన తెలియజేశారు.ఎస్.మల్లి మాట్లాడుతూ,గ్రామంలో పులుసుగోపి అనే అతను ఆయన భార్య శ్మశానంలోకి వచ్చి మామిడి మొక్కలు వేయాలని గోతులు తవ్వుతున్నారని తెలిపారు. స్థానికులు నిరసన తెలియచేస్తూ ఈవిషయంపై కావలి రూరల్ సిఐ రాజేశ్వరరావుకు తెలియచేయగా ఎవరు కూడా శ్మశాన స్థలం వద్దకు వెళ్ళవద్దని సంబంధిత పత్రాలను తహశీల్దార్ దృష్టికి తీసుకొని వెళ్లి పరిశీలించి అప్పుడు పరిష్కరించను జరుగుతుందని తెలియజేయడం జరిగిందన్నారు. ఎన్నికల సందర్భంగా తగాదాలు పెట్టుకోవద్దని, ఎవరు కూడా భూమిలోకి దిగవద్దని పది రోజుల్లో పరిష్కారం చేస్తానని దళితులకు హామీ ఇచ్చారని తెలియజేశారు. ఒక కుటుంబానికి,భార్యకు,భర్తకు అన్నకు,కుమార్తెకు జాతీయ రహదారి పక్కన 21 ఎకరాలు తీసుకొన్నారని శ్మశాన స్థలానికి పట్టా తెచ్చుకోవడం రెవెన్యూ అధికారుల దగా కోరు తనానికి నిదర్శనం అన్నారు. భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకొనేది లేదని స్థలాన్ని కాపాడుకుంటామని తెలిపారు. దళితులు పోరాటంలో మరణించేందుకు సిద్ధంగా ఉన్నారని స్థానికి తహశీల్దార్ బాధ్యత వహించాలని అన్నారు. ఈ నిరసనలో జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మీనర్సు, కోటయ్య, నారుబోయిన జాషవ, జనార్ధన్, పీటర్, జెడ్డా వాసు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి



**కోవూరు,అక్టోబర్25 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీసులు కూడా తమవంతుగా సహకరించాలని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం కోవూరు ప్రధాన రహదారిలో పోలీసుల మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఈ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ద్వారా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించి ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తమవంతుగా సహకరించాలన్నారు. ఓటర్లు ధైర్యంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై ముత్యాలరావు, ఇందుకూరుపేట ఎస్సై

# బీ..ఫారం దక్కేదెవరికో..!
## పార్టీ కోసం కష్టపడేవారికి టక్కెట్ ఇవ్వాలి

నవీన్‌కుమార్, ఏఎస్సైలు సత్యనారాయణ, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు ఉన్నారు.

**కోట,అక్టోబర్ 25 ప్రభాతవార్త :** ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎన్నికల రాజకీయ సరవత్తరంగా మారుతోంది. జిల్లాలో 440 ఎంపీటీసీల స్దానాలకు దాఖలైన నామినేషన్ల కు 2639 ఎంపిటీసీల అభ్యర్దులు బరిలో ఉన్నారు. బీఫారాల కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నామినేషన్ల ఉపసంహరణ నాటికి బీఫారం దక్కకపోతే ఏం చేయాలనే సమాలోచనలు చేస్తున్నారు.కొందరైతే తాము బరిలోంచి తప్పుకోమనే సంకేతాలు అధిష్టానాలకు ఇస్తున్నారే చర్చ జరుగుతోంది. ఇదే పరిస్దితి జడ్పీటీసీ అభ్యర్దుల్లో కూడా ఉంది.కొంత మంది ఎంపిటీసీల అభ్యర్దులు తాము పోటీలో ఉంటామని స్పష్టంగా చెబుతున్నట్లు సమాచారం. ఇలాంటి వారి విషయంలో ఎలా వ్యవహరించాలని ఆయా పార్టీల నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. మరి కొందరు తాము నామినేషన్ ఉపసంహరించుకోవాలంటే ఇవి కావాలంటూ..కొన్ని డిమాండ్లు తెరపైకి తెస్తున్నారు. దీంతో వారికి హామీలు ఇచ్చి పోటీ నుంచి తప్పించాలని భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 28 నెలలు కావస్తున్నా ఇంత వరకు గ్రామానికి రాకుండా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక ఎంచాక ఎంపిటీసీ స్దానానికి నామినేషన్ వేస్తే ప్రజలు ఓట్లు వేస్తారాని అని కోట మండలంలోని ఒ నాయకుడుతీరుపై కూటమి నాయకులు కొందరు రుసు రుసులాడుతున్నారు. ఎక్కాడో వ్యాపారులు చేసుకొంటూ ఎన్నికల సమయంలో తళ్లుకుమంటే కుదరుదని ప్రజలకు అందుబాటులో ఉండే వారికి పార్టీ అధిష్ఠానం బీ ఫారం ఇవ్వాలని ఆగ్రామ ప్రజలు కోరుతున్నారు.

## డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా కూటమి అభ్యర్థి గుర్రం కెజియా కుమారి



**నెల్లూరు , అక్టోబరు 25 ప్రభాతవార్త విద్య** కార్పొరేషన్ ఎన్నికల్లో తనను 15 డివిజన్ కార్పొరేషన్ అభ్యర్థిగా గెలిపిస్తే డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడతానని జనసేన పార్టీ 15 డివిజన్ నాయకులు గుర్రం కిషోర్ బాబు సతీమణి కూటమి అభ్యర్థి గుర్రం కెజీయా కుమారి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం డివిజన్ పరిధిలోని ఆర్కే నగర్ ఆర్కే నగర్, నవాబుపేట మెయిన్ రోడ్డు, డబ్బాల వీధి, గాండ్ల వీధి , తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. కూటమి పొత్తుల భాగంగా జనసేన పార్టీకి చెందిన తమకు ఈ డివిజన్ నుంచి పోటీ చేసే అరుదైన అవకాశం లభించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిత్యం ప్రజల్లో ఉండి వారికి సేవ చేస్తానని ఆమె తెలిపారు . ఒక్కసారి తమకు అవకాశం ఇచ్చి చూడాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జనసేన నేత గుర్రం కిషోర్ బాబు మాట్లాడుతూ కూటమి పొత్తులో భాగంగా మంత్రి నారాయణ ఆశీర్వాదంతో తమకు దక్కిన అవకాశాన్ని వినియోగించుకొని గెలుపు కోసం పాటుపడతామన్నారు. ప్రజల తమను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ కి చెందిన స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నా ప్రాణం ఉన్నంత వరకు పార్టీకి ద్రోహం చేయను

**- వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి**



**కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త** తన ప్రాణం ఉన్నంతవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేయనని పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోట మండలం కొక్కుపాడు ఎంపిటిసి వైసీపీ అభ్యర్థి నామినేషన్‌ను అధికారులు తొలగించడంపై తాను గూడూరు ఆర్డీఓకి ఫిర్యాదు చేశానని ఆయన చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఎంపిటిసి అభ్యర్థి ఓటరు జాబితాలో నంబర్ 836 అయితే అధికారులు ఆ నంబర్‌ను 886గా గుర్తించి ఆ నామినేషన్‌ను తిరస్కరించారని చెప్పారు. ఆ మేరకు తాను ఆర్డీఓను కలిసి వివరించినట్లు తెలిపారు. ఇందుకొరకు సోమవారం విచారణకు అధికారులు మీ అభ్యర్థి హాజరు కావాలని కోరారని చెప్పారు. తన నామినేషన్ తొలగిస్తున్నట్లు అధికారులు తనకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా అలాంటిదేమీ చేయకుండా తొలగించారని చెప్పారు. తాను 2011 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఓదార్పుయాత్రలో పాల్గొన్నానని సంపత్‌కుమార్‌రెడ్డి గుర్తు చేశారు. ఎక్కడో చిన్న పొరపాటు జరిగితే దాన్ని తనపై తమ పార్టీ వారే రాజకీయంగా బురదచల్లడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను 15 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నానని చెప్పారు. ఒక్క అవినీతి ఆరోపణ కూడా తనపై లేదన్నారు. మానవ తప్పిదంలో భాగంగా జరిగిన పొరపాటేనని తాను బాధపడుతున్నానని చెప్పారు. ఒకపక్క నామినేషన్ కేంద్రం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుపడటం, మరోపక్క వర్షం, ఈ టెన్షన్ వాతావరణంలో జరిగిన పొరపాటును తాను గ్రహించలేదన్నారు. ఇంతలోనే తనపై రకరకాల ప్రచారాలు చేశారని సంపత్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉంటూ పార్టీకి వెన్నుపోటు పొడిచే అలవాటు తన వంశంలోనే లేదన్నారు. జరిగిన పొరపాటుపై పార్టీ పెద్దలకు వివరణ ఇస్తానని చెప్పారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నంత వరకు డయల్ యువర్ ఎస్ఈ, డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాలు రద్దు

**- విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించండి**

**- ఎస్ఈ పి. సుధాకర్**



**నెల్లూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త – వైద్యం :** విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకొని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో నిర్వహించే 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమంతో పాటు, తిరుపతిలోని ఏపీఎస్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాలను ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నంత వరకు రద్దు చేసినట్లు నెల్లూరు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) పి. సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో, ప్రతి సోమవారం నిర్వహించే ఈ రెండు కార్యక్రమాలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన అనంతరం ఈ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేయవచ్చని, అలాగే చాట్‌బాట్ నంబరు 9133331912కు సందేశం పంపడం ద్వారా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందవచ్చని ఎస్ఈ పి. సుధాకర్ సూచించారు.

## గునుగుల విజయలక్ష్మి గెలుపు కోసం నేతల విస్తృత ప్రచారం



**నెల్లూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త విద్య** కార్పొరేషన్ పరిధిలోని 21 డివిజన్ కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి గునుగుల కిషోర్ సతీమణి, గునుగుల విజయలక్ష్మి మ్మ గెలుపు కోసం తెలుగుదేశం పార్టీ నేతలు డివిజన్లోని అనేక ప్రాంతాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు రోడ్డు షో లు నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె పొంగూరు శరణి స్థానిక21 డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, రాంజీ నగర్, చిల్డ్రన్ పార్క్ తదితర ప్రాంతాల్లో పర్యటించి గ్లాసు గుర్తుకు ఓటు వేసి స్థానిక అభ్యర్థి గునుగుల విజయలక్ష్మి మ్మని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డివిజన్లో పర్యటనకు విచ్చేసిన పొంగూరు శరణిని జనసేన నేతలు, గునుగుల దంపతులు భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే నగరంలోని స్థానిక చిల్డ్రన్స్ పార్క్ లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వాకర్ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ తమ కూటమి అభ్యర్థి గునుకుల విజయలక్ష్మి మ్మని ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి రూ కుమార్ యాదవ్ సైతం అఖండ మెజారిటీతో గెలుపొందేందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కూటమితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం చిల్డ్రన్స్ పార్క్ లో సభ్యులకు ప్రచార ప్రతులను పంపిణీ చేశారు. 21 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గునుగుల విజయలక్ష్మి మ్మ, సీనియర్ నాయకురాలు తాళ్లపాక అనురాధ, నాయకులు మంగమూరు యశ్వంత్ రెడ్డి, హరికృష్ణ రెడ్డి, కేవీ రెడ్డి, బాల కోటేశ్వరరావు, తెలుగుదేశం, బిజెపి, జనసేన, పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నార్త్ రాజుపాలెంలో కార్డెన్ సెర్చ్



**కొడవలూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు మండలంలోని నార్త్ రాజుపాలెంలో మహాలక్ష్మి మ్మ అమ్మవారి ఆలయం వద్ద పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కొడవలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు వీధివీధినా తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను పరిశీలించారు. ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు అంశాలపై ప్రచారం నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పిల్లలు సెల్‌ఫోన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఎక్కడికి వెళ్తున్నారనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. వారి ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే గుర్తించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తగిన సూచనలు చేయాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు, విడవలూరు ఎస్సైలు కోటిరెడ్డి, సాయి కళ్యాణ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేని కలిసిన దగదర్తి మండలం వైసిపి నేతలు



**కావలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** వైసిపి కావలి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ని ఆదివారం కావలి పట్టణంలోని ఆయన నివాసంలో దగదర్తి మండలం వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు చింతల బోయిన వెంకటేశ్వర్లు, యూత్ వింగ్ ప్రెసిడెంట్ వట్టికాళ్ళ మాధవరావు, వట్టికాళ్ల వెంకటేశ్వర్లు, గద్దగుంట మాధవ, డేగా మహేష్, దగదర్తి మండల వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పలు అంశాల గురించి చర్చించడం జరిగింది.

## ఈ నెల 27వ తేదిలోగా బి-ఫారంలు అందజేయాలి



**కోవూరు, అక్టోబర్25 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఇటీవల ఎంపీటీసీ అభ్యర్థులకు వివిధ పార్టీల నుంచి నామినేషన్ దాఖలా చేసిన అభ్యర్థులు ఈ నెల 27వ తేది మూడు గంటలలోగా పార్టీలకు సంబంధించిన బి-ఫారంను తప్పక అందజేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిత అన్నారు. కోవూరులోని కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఒకవేళ సకాలంలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు బి-ఫారం దాఖలా చేయకపోతే వారిని స్వతంత్ర అభ్యర్థులుగా గుర్తించి గుర్తులు అందజేయడం జరుగుతుందన్నారు.

## రోడ్డెక్కిన పూడిక చెత్త.. దోమల వ్యాప్తి, దుర్వాసనతో అల్లాడుతున్న జనం!

**: పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

**: రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదంటూ విమర్శలు**




**విడవలూరు అక్టోబర్ 25 ప్రభాతవార్త :** పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాల్సిన అధికారులే, సమస్యలకు కారణమవుతున్న దయనీయ పరిస్థితి ఇది. విడవలూరు గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న అరుంధతివాడ కాలనీలో సైడ్ కాలువలో పూడిక తీసి రోడ్డుపైనే వేసిన చెత్తను రోజుల తరబడి తొలగించకపోవడంతో, ఆ చెత్త గుట్టలపై గడ్డి మొలిచి దోమలకు నిలయంగా మారింది. అంతేకాకుండా, ఆ చెత్త కుళ్లిపోయి వస్తున్న దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుర్వాసన, దోమల బెడద వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినప్పటికీ, ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదని, కనీస చర్యలు కూడా చేపట్టలేదని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. అధికారికి ప్రజా సమస్యల పరిష్కారంపై ఉన్న శ్రద్ధ రాజకీయాలపై, ఇతర కార్యక్రమాలపై ఉండటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి, పారిశుద్ధ్య పనులను మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## స్వర్గీయ ఇలింద్ర వరదరాజం శత జయంతి వేడుకలు

**- నివాళులర్పించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి**





**కావలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** కావలి పట్టణంలోని కలయిక కళ్యాణ మండపం నందు ఆదివారం స్వర్గీయ ఇలింద్ర వరదరాజం శత జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని స్వర్గీయ ఇలింద్ర వరదరాజం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడుతూ** స్వర్గీయ ఇలింద్ర వరదరాజ్యం జ్ఞాపకార్థం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవకు అంకితమై వారు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమాజ సేవలో ముందుండే వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు లక్ష రూపాయల విరాళం చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా రోటరీ క్లబ్ ప్రతినిధులకు అందజేశారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు రొటేరియన్ అంకినపల్లి రమేష్‌రెడ్డి, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ హరినారపురెడ్డి, వీరరాఘవ ఫర్టిలైజర్స్ అధినేత బచ్చు వీరాస్వామి, ఇలింద్ర వరదరాజం కుటుంబ సభ్యులు, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్, ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## దోబీ ఘాట్ నిర్మించారు.. రూ. 5 లక్షలు నీళ్లలో పడేశారు

**- నేటికీ ఉపయోగపడని కోవూరు దోబీ ఘాట్**



**కోవూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని రజకులకు దుస్తులను పరిశుభ్రంగా చేసేందుకు గత ప్రభుత్వంలో రూ. 5 లక్షలు వ్యయం చేసి నాగలకట్ట సమీపంలో దోబీ ఘాట్ నిర్మించారు. ఈ దోబీ ఘాట్ నిర్మిస్తే తమ కష్టాలు తీరుతాయని రజకులు భావించినా అవి నేటికీ వారికి అందుబాటులోకి రాలేకున్నాయి. ఫలితంగా నానా అవస్థలు పడుతూ రజకులు దుస్తులను ఉతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. నియోజకవర్గంకు మండల కేంద్రమైన కోవూరులోని నాగలకట్టలో చోటు చేసుకుంది. గతంలో రూ. 5 లక్షల వ్యయంతో నాగలకట్ట ప్రాంతంలో దోబీ ఘాట్ నిర్మించాలని సంబంధిత పంచాయతీ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. ఈ చేపట్టిన పనులు అసంపూర్తి దశలో ఉండడంతో అవి ఉపయోగపడలేకున్నాయి. ఈ దోబీ ఘాట్ నిర్మించిన ఇనుము పైపులు కూడా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. దీనికి తోడు ఈ దోబీ ఘాట్‌కు సంబంధించి ఒక గది ఏర్పాటు చేసి అందులో యంత్ర పరికరాలు ఏర్పాటు చేసినా ఈ గది తలుపు పగలకొట్టి ఆ యంత్ర పరికరాన్ని కూడా అపహరించుకుపోయారు. దీంతో ఎంతో సదుద్దేశంతో లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఈ దోబీ ఘాట్ నిర్మాణం చేపట్టినా నేటికీ అది వారికి ఉపయోగపడుతున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించిన ఈ దోబీ ఘాట్ రజకులకు ఉపయోగపడేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం..!

**- చర్యలకు ప్రభుత్వ ఉత్తర్వులు**

**ఉదయగిరి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** ఉదయగిరి మేజర్ గ్రామ పంచాయతీ లో 2014-2020 మధ్య నిధులు దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై సంబంధిత శాఖకు చెందిన తొమ్మిది మంది ఉద్యోగులపై ఉమ్మడి క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిసింది. డిఎల్‌పిఓ లు ఎన్.శ్రీనివాసరావు, ఏ.రమేష్, ఈఓపిఆర్ అండ్ ఆర్‌డిఎస్ ఆదినారాయణ, షేక్ జహీర్, పిఎస్ ఎల్.శ్రీనివాసరావు, చిన్నబాబు, ఎంపీడీవో ఆర్‌ఎస్ వీరస్వామి పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్‌లు వై వాణి, వైవి దయాళ్ పై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.




## శ్మశాన భూములను వదులుకొనే ప్రసక్తే లేదు



**కావలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** ఎంతమందిని కాల్చిన కూడా శ్మశాన భూములను వదులుకొనే ప్రసక్తే లేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోట శ్మశాన స్థలంలో వందలాది మంది ప్రజలు మా శ్మశాన స్థలాన్ని ఎన్ని కోర్టు ఆర్డర్లు ఇచ్చినా, ఎంత మంది పోలీసులు వచ్చినా శ్మశాన భూమిని వదులుకొనే ప్రసక్తే లేదని ఆదివారం నిరసన తెలియజేశారు. ఎస్.మల్లి మాట్లాడుతూ గ్రామంలో పులుసుగోపి అనే అతను ఆయన భార్య శ్మశానంలోకి వచ్చి మామిడి మొక్కలు వేయాలని గోతులు తవ్వుతున్నారని తెలిపారు. స్థానికులు నిరసన తెలియచేస్తూ ఈవిషయంపై కావలి రూరల్ సిఐ రాజేశ్వరరావుకు తెలియచేయగా ఎవరు కూడా శ్మశాన స్థలం వద్దకు వెళ్ళవద్దని సంబంధిత పత్రాలను తహశీల్దార్ దృష్టికి తీసుకొని వెళ్లి పరిశీలించి అప్పుడు పరిష్కరించను జరుగుతుందని తెలియజేయడం జరిగిందన్నారు. ఎన్నికల సందర్భంగా తగాదాలు పెట్టుకోవద్దని, ఎవరు కూడా భూమిలోకి దిగవద్దని పది రోజుల్లో పరిష్కారం చేస్తానని దళితులకు హామీ ఇచ్చారని తెలియజేశారు. ఒక కుటుంబానికి, భార్యకు, భర్తకు అన్నకు, కుమార్తెకు జాతీయ రహదారి పక్కన 21 ఎకరాలు తీసుకొన్నారని శ్మశాన స్థలానికి పట్టా తెచ్చుకోవడం రెవెన్యూ అధికారుల దగా కోరు తనానికి నిదర్శనం అన్నారు. భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకొనేది లేదని స్థలాన్ని కాపాడుకుంటామని తెలిపారు. దళితులు పోరాటంలో మరణించేందుకు సిద్ధంగా ఉన్నారని స్థానికి తహశీల్దార్ బాధ్యత వహించాలని అన్నారు. ఈ నిరసనలో జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మీనర్సు, కోటయ్య, నారుబోయిన జాషవ, జనార్ధన్, పీటర్, జెడ్డా వాసు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.